# చల్ మోహనరంగ...

ఒక పెన్సిలూ, నోటు బుక్కూ తీసుకురండి. మొగుళ్ళ పెంపకం గురించి నోట్సు చెప్తాను రాసుకుందురుగాని. మొగుళ్ళ పెంపకమేమిటి కోళ్ళ పెంపకంలాగ అని ఆశ్చర్యపోకండి. వాళ్ళమ్మ పెంచి మనకిస్తుందా మొగుడ్ని, వియ్యపురాలి లాంఛనాలూ అవీ పుచ్చుకుని - దానర్థమేవిటి? వీడ్నిక నేను పెంచలేను. నువ్వు పెంచుకోవే అమ్మాయీ అని. అప్పుడు రారమ్మని మీరే మొగుడ్ని పెంచుకోవాలి. కంటికి రెప్పలా. అంటే మీ దగ్గరో "రిమోట్ కంట్రోల్" వుంటుంది. పెళ్ళాంలో కూడా తల్లి దాగోనుంటుందని నర్మగర్భితంగా చెప్పా నిదివరకోసారి. తల్లి అంటే కనిపారేసే ఆటోమేషన్‌కాదు. మమతానుబంధాలతో పెంచే మమకారపు ముద్ద - అంటే చలివిడి ముద్దకాదు. చల్లగా, తియ్యగా, ప్రేమగా, లాలనగా చూసుకోవాలి మొగుడ్ని, అప్పుడప్పుడు గిల్లొచ్చు - గిల్లినా, కొరికినా అందులో మాధుర్యం వుండాలి. ప్రేమ గిల్లులూ, ప్రేమ కొరుకులూ పడకుండా మొగుడ్ని పెంచి యింతవాడిని అంతవాడిని చేయటం మాటలు కాదు.

అప్పుడప్పుడో దెబ్బ చిన్నది వేయొచ్చు. కాని నెత్తిమీద వాళ్ళమ్మ యిదివరకే వేసుంటుంది. వాళ్ళ మాస్టారు వీపు మీద వేసుంటారు. ఆటల్లోపడో, చిన్నప్పుడు సైకిలు మీంచి పల్టీలుకొట్టో, మోచేతులూ, మోకాళ్ళూ డోక్కుపోయుంటాయి. మనం బుగ్గమీద వేయొచ్చు, ముక్కుపట్టుకు ఆడించొచ్చు. చెవి మెలిపెట్టొచ్చా అని అడుగుతున్నారా - వన్‌మినిట్ మీరు పొట్టి బుడంకాయ కాకపోతే ట్రయిచేయండి. లేకపోతే ఒక స్టూలు వేసుకుని నిలబడి చెవి తిప్పండి. చెవి తిప్పేముందు చెవి పరీక్ష చేస్తున్నట్లు గులివితెడ్డో, అగ్గి పుల్లో, పుచ్చుకుని ఇష్ మాట్లాడకండి అని అతని బుర్రవొంచి ట్రయ్ ది గేంఫర్ సం టైమ్. ఇప్పుడది కనిపెట్టి చెవిలో ఏదో వుంది. చూద్దూ అని మీ మెడకాయ దగ్గర తన మెడకాయను తెచ్చి తనే ఆఫర్ చేస్తాడు. "ఇప్పుడు టైం లేదు, బిజీ!" అని చెప్పండి.

మీ వారు ఆడపిల్లలా వుంటారని ఎవరేనా కామెంటుచేస్తే కోపం తెచ్చుకోకండి. ఏవండి మీరు ఆడపిల్లలా వుంటారటగా అని మెడచుట్టూ చేతులువేసి స్టాప్, వద్దు - ముందు గదితలుపులన్నీ వేసి కిటికీ కర్టెన్లు మూసివచ్చి అద్దం ముందు కూర్చోపెట్టి మేకప్ చేయండి. ఇలాటి ప్రోగ్రాం ఏ ఆదివారం మధ్యాహ్నమో, యింట్లో ఎవరూ లేనప్పుడు ప్రారంభించాలి. కాటుక పెట్టించుకోవడానికి మగాళ్లు పేచీ పెట్తారు. కాంతకు కాటుక కన్నులె అందం అన్నారని చెప్పండి. నేను కాంతను కానంటాడు. కాస్సేపు నువ్వు నాకు కాంతవే అని నచ్చచెప్పి కాటుక పెట్టి బుగ్గను చుక్కపెట్టి చీరకట్టుకోమనండి. అసలు జరీ అంచులు మీ కాళ్ళమీదెలా గుంటాయో చూద్దామని... ఓ పట్టాన లొంగరు. లుంగీకట్టుకోవడంలే అంతే అని మభ్యపెట్టి, మోసంచేసి చీరకట్టి స్టూలుమీద కూర్చోపెట్టి నెత్తిమీద ముసుగేయండి. అప్పుడూ ఆలాఫ్ సడన్ - తలుపు

తీసి గదిలోంచి పారిపోండి. అప్పటికి మీ ఫ్రండ్స్ ఎవరేనా లేడీస్‌ని వచ్చి తలుపు తట్టమనండి. ది యంగ్ మేన్ విల్ టరన్ మ్యాడ్... మీరతడ్ని ఒక సిగరెట్‌పెట్టి అగ్గిపెట్టి యిచ్చి మంచం కింద దాక్కోమనండి. మీ చీర ఖరీదైనదైతే అగ్గిపెట్టె సిగరెట్ పెట్టె యివ్వకుండా ఒక వీక్లీనో మంత్లీనో యిచ్చి చదువుకోమనండి. చాప, దిండు మరచెంబుకూడా సప్లయిచేయచ్చు. అప్పుడు మీ ఫ్రెండ్సుని మీ బెడ్ రూంలోకి రానివ్వకండి. మీ బెడ్‌రూం ఒక అమ్యూజ్‌మెంటు పార్కు అనుకోగల్రు.

అఫ్‌కోర్సు – కొందరు మగాళ్లు లుంగీలా చీరకట్టుకుని పైన స్లాక్స్ వేసుకుంటే బావుంటారు. పూర్వం మన ప్రబంధాల్లో నాయికా నాయకులు యిలా లీజర్లీగా ఏవో గొడవలు పడుతూండేవార నేందుకు బోల్డు దాఖలాలున్నాయి. ఇప్పుడు మీకు టైం లేదంటారా? ఉన్న టైమునే సద్వినియోగం చేసుకోండి.

మొగుడ్ని డొమిస్టికేట్ చెయ్యలేని ఆడది జీవితంలో సుఖపడలేదు. మీవారో పెద్ద ఆల్సేసిషియన్ కుక్కలా భయంకరంగా వుంటారనుకోండి. ఆల్సేషియన్ కుక్కలకు కూడా కట్టడానికి బెల్టులూ, తాళ్ళూ, గొలుసులూ వుంటాయిగా. అవన్నీ తెచ్చి వుపయోగించండి. మీరుకూడా చీరమీద కోటువేసుకుని టోపీ పెట్టుకుని స్టిక్కు చేత్తోపట్టుకుని వేషాలెయ్యొచ్చు. బెడ్రూంలో మిమ్మల్ని అడిగేవారెవరు? దటీజ్ యువర్ వ(ర)ల్డు. ఇలాటి సరదాలన్నీ ఒకరిద్దరు పిల్లలు పుట్టకముందే తీరిపోవాలి. తరవాతిహ డ్రెస్ రిహార్సల్స్‌కి టైముండదు.

పెద్దాళ్ళున్న కొంపల్లో కుర్రాళ్ళ కిలాటి చిన్నచిన్న సరదాలు తీరవు. అంతమందికీ రూమ్స్ వుండవు. అమ్మదగ్గరో, అత్తయ్యదగ్గరో చాప మీద అమ్మాయి పడుకుంటే అబ్బాయి హాల్లో ఫాన్ క్రింద మడతమంచం వేసుకుని ఇలస్ట్రేటెడ్ వీక్లీ గుండెల మీద వేసుకుని నిద్దరోవాలి. జాయింట్ ఫామిలీస్‌లో జాయింట్ మిజరీ ఎక్కువగా వుంటుంది. పెద్దాళ్ళ ప్రపంచం ఎక్కడ ఆఖరవుతుందో, కుర్రాళ్ళ ప్రపంచం ఎక్కడ ప్రారంభమవుతుందో గాడోన్లీ నోస్ – కొందరు బ్రూట్స్ మన కిటికీ పక్కనే మంచాలు వాల్చుకు పడుకుంటారు సి.ఐ.డీల్లా. అర్ధరాత్రప్పుడొస్తూంటారు మిడ్‌నైటు గెస్టులు... ఈ గెస్టు దేవతలకు రూం యిచ్చేసి రెస్టాఫ్‌ది నైట్ ఏ వరండాలోనో చాప పర్చుకుని దొర్లాలి. చిన్నవాళ్ళకు చిన్నచిన్న కోరికలుంటాయి. సరదాలుంటాయి. వాళ్ళ ఖర్మానికి వాళ్ళ నొదిలెయ్యాలే కాని వాళ్ళకి ఏకాంతం లేకుండాచేసి నవ్వుకోడం మహాఘోరం.

చాలా సోకాల్డు రెస్పెక్టబుల్ ఫామిలీస్ అవి రెస్పెక్టబుల్ కావు. వాళ్లు తమమీద ఆధారపడి వున్నవాళ్ళ వ్యక్తిత్వాల్ని తీవ్రంగా హర్ట్ చేస్తారు. అంచేతే ఉద్యోగాలు కాంగానే యంగ్‌మెన్ పెళ్ళాల్ని తీసుకుని చల్ మోహనరంగా అని వేరడిపోతూవుంటారు. ఏకాంతకు కావలసిన ఏకాంతం ఆ కాంతకు వుండకపోతే కోడలుపిల్లలు కొడుకులికి న్యూయిచ్చి "అమ్మ కావాలా – బొమ్మ కావాలా" అని అడిగేస్తారు.

మొగుడ్ని హీరో చేసి ఆరాధించుకోవాలనుకునే అమ్మాయికి జాయింట్ ఫామిలీలో తన మొగుడి స్థానాన్ని బట్టి తనకు లభించే గౌరవంతో తృప్తిపడి ఎన్నాళ్ళని సర్దుకునిపోతుంది. అందుకే ఎప్పుడో ఒహప్పుడు 'చల్ మోహనరంగా' అని పాడుతుంది. నీకు నీవారూలేరు నాకు నావారులేరు ఏటిఒడ్డున యిల్లుకడదాం పదరా చల్ మోహనరంగా - ఏరువస్తే యీదిపోదాం పదరా అంటుంది.

# ప్రౌఢ వ్యాకరణం

జమాన్‌కి యజమానికి, ఆట్టే తేడాలేదు. మాంచి ఒడ్డూ పొడుగూ వుండే మనిషిని జమాన్ అంటారు. అంభేరురాలులావున్న మనిషిని కూడా ఆవిడ మంచి జమాన్ అంటారు. కనుక యముడి చెల్లెలు అయినా కాక పోయినా జమాన్‌రాలు యజమానురాలు అయి తీరుతుంది. యింటికి యముడులాటి జమాన్ కాబట్టి అతగాడు యజమాన్ అవుతాడు, సో - ఎవ్వెరి గృహభార్య వంటింటి మహాలక్ష్మే.... రాట్సు కాట్సు అండ్ డాగ్స్‌తో పేచీలు పడని గృహలక్ష్మి భూస్థలమంతా వెదికినా దొరకదు. మనిషిగారి మంచి స్నేహితుడైన కుక్క దాని విరోధి పిల్లి. పిల్లికి మెడలో గంటకట్టలేని ఎలుక యివి అన్నీ ఇల్లాలి ప్రాణం విసిగించేస్తూంటాయి.

బైదిబై బొజ్జెంకలు, చీమలు (కండ వితవుట్ కండ) ఈగలు, దోమలు అన్నీ హవుస్ వైఫ్‌గార్ని వేపుకుతినేవే. కాకులు ఇవి ఇల్లాండ్రను అస్సలే కేర్ చెయ్యవు. సబ్బిళ్ళలూ నేతిగరిట్సూ చమ్చాలు ఎత్తికెళ్ళి యిక్కడివక్కడ అక్కడివిక్కడా సర్దేస్తూ గొప్ప ట్రబుల్స్ క్రియేట్ చేస్తూంటాయి.

కోతులైతే, కాలేజీ అమ్మాయిల్ని కొంగుపుచ్చుకులాగి తల్లో పూలు వాసన చూస్తాయికూడా. స్త్రీలు కఱ్ఱ పుచ్చుకున్నా కోతులు డామ్ కేర్ మాస్టర్లు... "పిల్లా తగ్గు" అంటాయి. ఫెయిర్ సెక్సంటే అన్‌ఫెయిర్ సెక్సుకి ఎప్పుడూ లోకువే. వెంటిలేటర్లో గూళ్ళు పెట్టి కాపరాల్జేసే పిచికలుంటాయి చూశారూ, అవి రెంటూ కరెంటుఖర్చూ లేకుండా రేడియో, ఫాన్ అన్నీ ఎంజాయి చేస్తూంటాయి. మన బాత్రూంలో స్నానాలు చేస్తూంటాయి. "వీళ్ళింకా నిద్రపోరేం చెప్మా" అన్నట్లు గదిలో హాల్లో కిచకిచమంటూ పిచిక తిట్లు తిడతాయి. కొత్తగా కాపురానికొచ్చిన అమ్మడి మొగుడు చనువుగా దగ్గరకు తీసుకుంటే "అవిగో పిచికలు చూస్తున్నాయి. అదుకో పిల్లి మనకేసే చూస్తోంది. కుక్క మన్ని అబ్జర్వు చేస్తోంది" అంటూ వూహ్వూ సిగ్గుపడిపోతుంది. మగాడు రాస్కెల్ గదా - యిలాటి సిగ్గులూ ఎగ్గులూ భయాలు వాడికుండవు. "సిల్లీగర్ల్" అని నెత్తి మీద ఓటిచ్చుకుంటాడు. ముద్దెట్టుకుంటే పిచికలు చూస్తున్నాయనే అమ్మడు అద్దం దగ్గరకు రమ్మంటే వస్తుందా. మునుపు అద్దాలు అందుబాటులో లేనపుడు ఒకరి కళ్ళల్లో కొకరు చూసుకునేవారు. అఫ్‌కోర్సు యిప్పుడు కూడా చూసుకుంటారు కనుకే ఎంకి అద్దమేలంటాది అందాలు తెలుప.